గెడ్డలో గిరిజనుడు గల్లంతు

ప్రజాశక్తి -అరకులోయరూరల్: గెడ్డ దాటుతూ గల్లంతైన గిరిజనుడు ఘటన కలకలాన్ని రేపింది. దీనికి సంబంధించి కుటుంబీకులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చొంపి పంచాయితీ అదే గ్రామానికి చెందిన కొర్ర సుధాకర్(బుజ్జి) 30 బుధవారం వివిధ పనుల నిమిత్తం అరకులోయ మండల కేంద్రానికి వెళ్ళి మళ్ళీ చొంపి గ్రామానికి సాయంత్రం తిరుగు ప్రయాణంలో నడుచుకుంటూ వస్తున్నాడు. చొంపి కాజ్వే దాటు తుండగా గడ్డవాగు ఉప్పొంగి ప్రవహించి రావడంతో కొట్టుకు పోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. గాలింపు చర్యలు చేపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బ్రిడ్జి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గెడ్డలో గాలిస్తున్న కుటుంబ సభ్యులు

గిరిజన రైతుల అభివృద్ధికి ప్రణాళికలు

ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్

మాట్లాడుతున్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్

ప్రజాశక్తి-అరకు లోయ: రైతుల అభివృద్ధికి మేధో మధనం చేయాలని ఏజెన్సీలో సుస్థిర మైన వ్యవసాయ అభివృద్ధిని సాధించాలని స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్ఎస్ రావత్ అన్నారు. వ్యవసాయనుబంధ రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధించాలని తెలిపారు. గురువారం పద్మాపురం గార్డెన్‌లో వ్యవసాయం, ఉద్యానవనం, పట్టు పరిశ్రమ, మత్స్యశాఖ ,పశు సంవర్ధక శాఖ,డి ఆర్.డి.ఏ, మార్కెటింగ్ శాఖ ,కాఫీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి సమగ్రమైన ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. రానున్న మూడేళ్ల లో ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని చెప్పారు. ఏజెన్సీలో దేశంలో ఎక్కడాలేని వనరులు ఉన్నాయని చెప్పారు. గిరిజనుల జీవనోపాదులు మెరుగు పరచాలన్నారు. పండ్ల తోటలను మరింత విస్తరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు పంటల బీమా సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. ఏజెన్సీలో సాగు చేస్తున్న వరి, రాగులు,రాజ్మా , ఇతర చిరు ధాన్యాల పంటల విస్తీర్ణం పై ఆరాతీశారు. జిల్లా సమాఖ్య, మండల సమాఖ్య గురించి ఆరాతీశారు. ఎన్ని మహిళా సంఘాలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు.

జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ, ఆర్గానిక్ కాఫీ సాగు, మిరియాలు, సాగులో రైతులకు వస్తున్న ఆదాయం, కాఫీ రైతులకు అందిస్తున్న గిట్టుబాటు ధరలు పసుపు,అల్లం , మిరియాలు, పర్యాటక రంగాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. సమున్నతి ఫౌండేషన్ చైర్మన్ పర్వేష్ శర్మ మాట్లాడుతూ, గిరిజన రైతులకు క్రెడిట్ గ్యారంటీ ఫండ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. సమున్నతి ఫౌండేషన్ అరకు వ్యాలీ, చింతపల్లి మండలం ఎస్ హెచ్ జీ లకు రుణాలు అందిస్తున్నామని చెప్పారు. 11 ఏళ్ళ నుండి ఎఫ్.పి.వోలకు రుణాలు అందిస్తున్నామని చెప్పారు. రైతులకు పంటల సాగు అమ్మకాలు, కొనుగోలులో సహరిస్తున్నామని అన్నారు. వ్యవసాయ పెట్టుబడులు తగ్గించడంలో సహాయ సహకారాలు అందిస్తున్నామని చెప్పారు. గిరిజన ఉత్పత్తుల లో నాణ్యతలు, తగిన నిబంధనలు పాటించాలని చెప్పారు. నాణ్యతలు పాటిస్తే బ్రాండింగ్ వస్తుందన్నారు. మహిళా సంఘాల తో కూరగాయలు సాగును చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటిడిఏ ఇంచార్జి ప్రాజెక్టు అధికారి, జాయింట్ కలెక్టర్ ఎం జె అభిషేక్ గౌడ, రంపచోడవరం చింతూరు ఐటిడిఎ పి.వోలు కె.సింహాచలం, అపూర్వభరత్, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిఏఓ ఎస్.బి.ఎస్ నంద్, డి హెచ్ ఓ ఏ. రమేష్ కుమార్‌రావు, డిఆర్‌డిఏ పిడి వి.మురళి, జిల్లా సెరికల్చర్ అధికారి కె.అప్పారావు, ఎల్ డి ఎం మాతు నాయుడు, పిఎంయు పి.ఓ రాంగోపాల్ , స్పైసెస్ బోర్డు సీనియర్ ఫీల్డ్ అధికారి బి.కళ్యాణి ,కాఫీ బోర్డ్ అధికారి రమేష్ పాల్గొన్నారు.

గిరిజన ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెటింగ్

ఎపి హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ హరి ప్రసాద్

గిరిజన కళాకారులు తయారు చేసిన వెదురు ఉత్పత్తులను పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-రంపచోడవరం

గిరిజన ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. వెదురుతో గిరిజనులు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన రంపచోడవరంలోని ఒక ప్రైవేట్ రిసార్ట్‌లో కుర్ల రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. దీనికి పసుపులేటి హరిప్రసాద్, రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వెదురుతో తయారు చేసిన పరికరాలను వారు పరిశీలించారు. అనంతరం హరి ప్రసాద్ మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజనులు తయారు చేసిన అన్ని ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు పొందేందుకు అవసరమైన అన్ని అనుమతులు తెచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రైస్ అనే హస్తకళల ప్రదర్శనలో 29 బహుమతులకు గాని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పది బహుమతులు వచ్చాయని తెలిపారు. ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో ఇటువంటి ఎన్నో రకాల ఉత్పత్తులు ఉన్నాయని, వాటికి మంచి గుర్తింపు తెచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. హస్తకళల కార్మికులకు ప్రోత్సాహక రుణాలు కూడా కల్పించేందుకు ముఖ్యమంత్రికి తెలియజేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కుర్ల రాజశేఖర్ రెడ్డి, బొలిశెట్టి సత్యనారాయణ, వంపురి గంగులయ్య, కాకి స్వామి, శ్రీనివాస్, 11 మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

మన్యంలో భారీ వర్షం

- ఉపశమనం పొందిన గిరిజనులు
- రోడ్లు, డ్రెయినేజీలు జలమయం

ప్రజాశక్తి-అరకులోయ: పర్యాటక కేంద్రమైన అరకులోయ ప్రాంతంలో గురువారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. గత వారం రోజులుగా తీవ్రమైన ఎండతో ఉక్కపోతకు గురైన ఈ ప్రాంత వాసులకు ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించింది. ఎడతెరిపి లేకుండా సుమారు మూడు గంటల పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి అరకు విశాఖ ప్రధాన రహదారి వర్షపు నీటితో నిండి చెరువును తలపింపజేసింది. దీంతో, వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడ్డారు. రోడ్లంతా జలమయం అవడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పంట పొలాలన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. ఉరుములు మెరుపులతో కూడిన కుండ పోత వర్షంతో పాటు,పెద్ద పెద్ద శబ్దాలతో పిడుగులు పడడంతో ఈ ప్రాంత జనాలు తీవ్ర భయాందోళన గురయ్యారు.

ఇదిలా ఉండగా కురిసిన కుండపోత వర్షం ౖతులకు ఎంతో ఉపకరించిందని పలువురు గిరిజనులు అభిప్రాయపడ్డారు. ఉదయం దట్టమైన పొగ మంచు కురిసి శీతాకాలన్నీ తలపింపజేసింది.

దుంబ్రిగుడ : మండల కేంద్రంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం సుమారు గంటపాటు కురిసిన వర్షంతో వీధి కాలువలు అన్ని వర్షపు నీటితో జలమయంగా మారాయి. మండల కేంద్రంలోని దుకాణాలు వద్ద వీధి కాలువలలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో వర్షపు నీరు నిరంతరం నిలువ ఉండిపోవడంతో దుకాణదారులు పలు ఇబ్బందులు పడ్డారు. మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న డ్రైనేజీ కాలువలను మరమ్మత్తు చేసి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసుకున్న పట్టించుకోకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసిన వర్షపు నీరంతా నిల్వ ఉండిపోతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని దుకాణదారులు ఆవేదన చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి డ్రైనేజ్ కాలువలు మరమత్తు చేపట్టాలని దుకాణదారులు స్థానికులు కోరుతున్నారు.

అరకులోయలో కురుస్తున్న వర్షం

లక్కవరంలో సమస్యలపై ఆందోళన

మంచినీటి సౌకర్యం, వీధిలైట్లు ఏర్పాటుకు డిమాండ్

ఖాళీ బిందెలతో సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న లక్కవరం గ్రామస్తులు

ప్రజాశక్తి-మోతుగూడెం

చింతూరు మండలం చదలవాడ పంచాయతీ లక్కవరంలో మంచినీరు, వీధి లైట్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక మహిళలు మహిళా సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో తులసిపాక సచివాలయం వద్ద గురువారం ఆందోళన నిర్వహించారు. ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాదికిపైగా వాటర్ ట్యాంక్ నుండి నీటి సరఫరా చేయడం లేదని, అనేకసార్లు సచివాలయం అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, కానీ సమస్య ఏమాత్రం పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. గ్రామంలోని బోరుబావులు మరమ్మతులకు గురయ్యాయని, మురుగునీటి వాసనతో కూడిన నీరు వస్తుందని తెలిపారు. దీని వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కూడా స్థానిక సచివాలయం అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన కనీస రిపేరు చర్యలు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో వీధిలైట్లు లేకపోవడం వల్ల రాత్రయతే గ్రామం మొత్తం అంధకారంలో ఉంటుందని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. గిరిజన సంఘం సీనియర్ నాయకులు మడకం చిన్నయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిత్యం ప్రకటనల్లో అభివృద్ధి, సంక్షేమ జపం చేయడం తప్ప, ఆచరణలో కనీస మౌలిక సౌకర్యాలు తీర్చడంలో విఫలమైందని విమర్శించారు. గ్రామాలలో మంచి నీటి ట్యాంకులు ఉన్నా మోటర్లు రిపేరు అయితే వాటికి మరమ్మతులు చేయించే పని కూడా చేయడం లేదని విమర్శించారు. ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, గ్రామ సచివాలయాలకు పంచాయతీలకు నిధులు కేటాయించి ప్రజల మౌలిక అవసరాలను తీర్చాలన డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు సాదుల లలిత, మడకం కాంతమ్మ, మడవి దుర్గ, వెంకమ్మ, సూడ ముత్తమ్మ, కాదుల భద్రమ్మ, గిరిజన సంఘం నాయకులు కలుముల మల్లేష్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేపడుతున్న సిపిఎం నేతలు

స్మార్ట్ మీటర్లను బిగించొద్దు

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి అరకులోయ రూరల్: స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని మాదల పంచాయతీ దాబుగుడ,రక్తకండి, గ్రామాల్లో గురువారం సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులు కరపత్రాలు చూపిస్తూ నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు కె రమేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ప్రతి ఇంటికి వినియోగించాలని ఒత్తిడి చేస్తూ ఆదేశాలు జారీ చేయడం తగదన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. 2024 ఎన్నికలకు ముందు జగన్ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగిస్తుంటే పగలగొట్టండి అని పిలుపునిచ్చిన నారా లోకేశ్ అధికారంలోకి రాగానే మీటర్లు ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. స్మార్ట్ మీటర్లను బిగించాలని ఒత్తిడి చేస్తే భవిష్యత్ లో ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బాలరాజు, సంతోష్, అప్పన్న, మోహన్, మహేష్,శివ,సీతమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి- హుకుంపేట: గడికించుమండ పంచాయతీ పరిధిలోని గడ్డిమర్రి గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తూ చెరువులో మునిగి మృతి చెందిన గేమ్మెలి సంతోష్, గెమ్మెలి అఖిల్ కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గిరిజన మహిళా సంఘం జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం హుకుంపేటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షులు వి.వి. జయ, అధ్యక్షురాలు కౌసల్య, జిల్లా కార్యదర్శి ఎస్.ఐ. హైమావతి మాట్లాడారు. బాధిత కుటుంబాలకు తక్షణమే 10 లక్షల రూపాయల నష్టపరిహారం అందించాలన్నారు. చిన్నారుల భవిష్యత్తు రక్షణ దృష్ట్యా బహిరంగ ప్రదేశాల్లో ఉన్న చెరువులకు కంచెలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి విషాదకర సంఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మానవీయతతో అండగా నిలవాలని గిరిజన మహిళా సంఘం జిల్లా కమిటీ స్పష్టం చేసింది.

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం మహిళా నేతలు

రెగ్యులర్ ఉపాధ్యాయున్ని నియమించాలని వినతి

ప్రజాశక్తి -కూనవరం : మండలంలోని ముల్లూరు పాఠశాలలో ఏడాది నుండి ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే రెగ్యులర్ ఉపాధ్యాయుని నియమించాలని పాఠశాల చైర్మన్ సోడె నాగేశ్వరరావు, పంచాయతీ సర్పంచ్ బొగ్గా వెంకమ్మ చింతూరు ఐటిడిఏ కార్యాలయంలో ఏపిఓకి గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాలను కాంట్రాక్టు టీచర్‌తో నడుపుతున్నారన్నారు. గతంలో ఈ పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేవారని, ఇప్పుడు ఒక్క కూడా లేరని పేర్కొన్నారు. ఈ పాఠశాలకు ఉపాధ్యాయుని నియమించడంలో ఎంఈఓ లక్ష్మీనారాయణ అలసత్వం వహిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే పాఠశాలకు రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. అలాగే వర్షాలకు కురుస్తే పాఠశాల మొత్తం కారపోయి పిల్లలు చదువు కోవాలంటే ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. తక్షణమే మరమ్మతులు చేయించాలనిఇ కోరారు. ఈ కార్యక్రమం మాజీ ఎంపీటీసీ మేకల నాగేశ్వరరావు, శీలం ప్రసాద్, జ్యోతి, పైదా వెంకయ్య పాల్గొన్నారు.

ఐటిడిఏ ఎపిఒకు వినతిపత్రం ఇస్తున్న ముల్లూరు గ్రామస్తులు

వెనుకబడిన మండలాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-సీలేరు

అల్లూరి సీతారామరాజు జిల్లాలో వెనుకబడిన చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు మండలాల అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కారే శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ 11 మండలాల్లో కాఫీ, రాజ్మా ఎక్కువగా గూడెం కొత్తవీధి, చింతపల్లి మండలాల్లో సాగు జరుగుతుందని తెలిపారు. చింతపల్లి మండలం గొందిపాకలు, పెదబరడ పంచాయతీల్లో గిరి రైతులు స్ట్రాబెరీ, లిచ్చి డ్రాగన్, పైనాపిల్, పసుపు, అల్లం, కాఫీ, మిరియాలు, మొక్కజొన్న వంటి పంటలు పండిస్తున్నారని చెప్పారు. గూడెం మండలంలో జెర్రల, మొండిగడ్డ పంచాయతీ పరిధిలో కమలా తోటలు అధిక శాతం గిరి రైతులు సాగు చేస్తున్నారన్నారు. వీటి అభివృద్ధికి అధికారులు తగిన శ్రద్ధ వహించడం లేదని విమర్శించారు. నూతన జిల్లా ఏర్పడిన తరువాత అరకు, పాడేరు ప్రాంతాలపైనే దృష్టి పెడుతున్నారని, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాల్లో అభివృద్ధి పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. గూడెం కొత్తవీధి మండలం ఆర్‌వి నగర్ నుంచి పాలగడ్డ వరకు ఉన్న అంతర్రాష్ట్ర రహదారి సుమారు 12 ఏళ్లగా అస్తవ్యస్తంగా ఉందని, ప్రయాణికులు నరకయాత అనుభవిస్తున్నారని, అయినా దాని గురించి పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. చింతపల్లిలో మినీ స్టేడియం నిర్మాణం, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు నివాస భవనాలు, ఇతర భవనాలు నిర్మాణం జరగలేదని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ మూడు మండలాల అభివృద్ధిపై చిత్తశుద్ధితో దృష్టి సారించాలని కోరారు.

చలో విజయవాడను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ ఈనెల 25న జరుగు హలో విద్యార్థి చలో విజయవాడ కార్యక్రమానికి విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిడిఎస్‌యు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గౌరవాధ్యక్షుడు ఐవి రమణ పిలుపునిచ్చారు. స్థానిక మార్పు యాంగిల్స్ భవనంలో గురువారం జరిగిన పిడిఎస్‌యు రంపచోడవరం డివిజన్ కార్యవర్గం సమావేశంలో గోడ పత్రికలను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న విజయవాడ ర్యాలీ, ధర్నా జరుగుతుందని చెప్పారు. కేజీ నుండి పీజీ వరకు విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పిడిఎస్ గౌరవ అధ్యక్షులు సర్పంచ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న బూర్లె హరిబాబు

పిఎసిఎస్ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అడ్డతీగల

అడ్డతీగల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) చైర్మన్‌గా బూర్లె హరిబాబు, డైరెక్టర్లుగా గంజి రమణ, కవ్వడం చెన్నాలమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులుఏ ఎడ్ల శ్రీనివాస్, పుడిగి ఆదిలక్ష్మి , బీర బాలయోగి, గుంజిగడ్డ ఏసుబాబు, అక్కపల్లి పండు, స్వప్న కుమారి, కుప్పలు జయరాం, సాయి, మార్కెటింగ్ డైరెక్టర్లు, కాలేజీ చైర్మన్, స్కూల్ చైర్మన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా గొంది చంద్రయ్య, డైరెక్టర్లుగా బొర్రా సత్యనారాయణ, సోడే వెంకమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. వారికి జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి , మాజీ జెడ్పిటిసి ఎం రామారావు ఆచంట శ్రీనివాస్, బొర్రా సత్యనారాయణ, బొర్రా నరసింహారావు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేఖపల్లి పాలకవర్గ సభ్యులను సత్కరించిన కూటమి నేతలు

తహశీల్దార్లు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-జికె వీధి: మండల రెవెన్యూ తహసిల్దార్ గా హెచ్ అన్నాజీరావు గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న తహసిల్దార్ టి రామకృష్ణ బదిలీ అయ్యారు. అన్నాజీరావు అల్లూరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈయన గతంలో కోటవురట్ల, నక్కపల్లి ప్రాంతాలలో డిప్యూటీ తహసిల్దారుగా విధులు నిర్వహించారు.

అనంతగిరి: మండల తహసిల్దార్‌గా ఎం. వీరభద్రచారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి జిల్లా కలెక్టరేట్లో డీటీగా పని చేస్తు ప్రమోషన్ పై మండలంలో తహసిల్దారుగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది మండలం ఉప తహసిల్దార్ గా పని చేస్తున్న సమ్మరెడ్డి. మాణిక్యం ఇన్చార్జి తహసిల్దారుగా బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసిల్దార్ వీరభద్రచారికు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు

జి.మాడుగుల: స్థానిక తహశీల్దారు గిడ్డి రాజ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇదే జి.మాడుగుల తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దారిగా విధులు నిర్వహించారు. ప్రమోషన్ పై తహసిల్దారుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇక్కడ గిరిజనులకు సేవలందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మండల కేంద్రంలో రెవెన్యూ శాఖపై మరింత దృష్టి పెట్టి ప్రజలకు ఎల్లవేళలా అధికారులందరూ అందుబాటులో ఉండేటట్లు చూస్తానన్నారు

అనంతగిరి తహశీల్దార్ వీరభద్రాచారిని సత్కరిస్తున్న ఉద్యోగులు

రాజ్‌కుమార్ (జి.మాడుగుల)

అన్నాజీరావు (జికె.వీధి)

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించం

జిల్లా వైద్య శాఖ అధికారి విశ్వేశ్వరనాయుడు

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్‌ఒ విశ్వేశ్వరనాయుడు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలోని సిహెచ్‌సిలో గురువారం జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర నాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిహెచ్‌సిలోని వార్డులో చికిత్స పొందుతున్న రోగులను, వైద్య సేవలు పొందుతున్న ఓపి పేషెంట్లను వైద్య అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో పలు రికార్డులను తనిఖీ చేసారు. సిబ్బంది అందుబాటులో ఉండాలని , మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. మండలంలో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులతో ప్రబలుతున్నాయన్నారు. ఈ కేసులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రస్తుతం వ్యాధులు వ్యాపించే సీజన్ కావడంతో గ్రామాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు నివేదికలు జిల్లా అధికారులకు తెలియజేయాలని కోరారు. మారుమూల గ్రామాల్లో వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శిస్తూ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం పై వైద్య సిబ్బంది దృష్టి సారించి గ్రామంలో పరిసరాల పరిశుభ్రత పాటించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు .
ఆదివాసి గిరిజన మహిళా సంఘం మండల అధ్యక్షురాలు ఈశ్వరీ డిఎంహెచ్‌ఓ విశ్వేశ్వర నాయుడు తో మాట్లాడుతూ సిహెచ్‌సిలో వైద్యుల కొరత అధికంగా ఉందని తెలిపారు. వైద్య సేవలు పొందేందుకు వచ్చే రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. సిహెచ్‌సిలో కేవలం ఇద్దరు వైద్యులతో ఆసుపత్రి నిర్వహణ కష్టతరంగా ఉందన్నారు. ఈ కారణంతో ఆసుపత్రికి వచ్చే రోగులు మెరుగైన వైద్యం పొందలేకపోతున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఏఓబి సరిహద్దు ప్రాంతం కావడంతో మామూల ప్రాంత ప్రజలతో పాటు ఒరిస్సా రాష్ట్ర వాసులు సైతం వైద్యం నిమిత్తం మండలంలోని సిహెచ్‌సికి వస్తున్నారన్నారు. ఇక్కడ సరిపడా సిబ్బంది, వైద్య సేవలు లేక అనేక ఇక్కట్లు ఎదురవుతున్నారని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారిని గీతాంజలి, హెచ్‌వి. రాంబాబు సిబ్బంది పాల్గొన్నారు.

మెటీరియల్ ఇస్తున్న సర్పంచ్ త్రినాథ్

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం గ్రామ పంచాయతీలోని దాబుగుడ ఎంపీపీ పాఠశాలలో గురువారం స్థానిక సర్పంచి కొర్రా.త్రినాధ్ చేతుల మీదుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఉపాధ్యాయుడు రంజిత్ కుమార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు కె.సుందర్ రావు, కె.నీలకంఠం, త్రినాధ్ పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు ఏర్పాటుకు స్థల పరిశీలన

స్థలాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-చింతపల్లి: వర్షాలతో వరద నీరు ఊట గెడ్డల్లోకి ప్రవహించడంతో మల్లవరం గ్రామస్తులు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ మహిళలు బురద కలిసిన నీటిని తాగాల్సిన పరిస్థితి ఏర్పడిన నేపథ్యంలో చింతపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత, నీటిపారుదల శాఖ డీఈ కరుణ, జేఈ స్వర్ణలతలతో కలిసి గ్రామాన్ని సందర్శించారు. ఊట గడ్డ వద్ద మహిళలు నీరు తీసుకునేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా పరిశీలించిన అధికారులు, గ్రామంలో శాశ్వతంగా తాగునీటి సమస్యకు పరిష్కారం చూపే విధంగా ట్యాంకు నిర్మాణానికి స్థల పరిశీలన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మల్లవరం గ్రామ మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-పెదబయలు : మండలకేంద్రంలో ఈనెల 18న విద్యుత్ అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూ టివ్ ఇంజినీర్ పి.వేణుగోల్ గురువారం సాయంత్రం పత్రిక ప్రకటన విడుదల చేసారు.స్థానిక సబ్ స్టేషన్ లో కొత్త బ్రేకర్లు అమర్చుట నిమిత్తం విద్యుత అంతరాయం ఏర్పడుతుందని, వినియోదరులు గమనించాలని పేర్కొన్నారు

ఫుడ్ వ్యాపారులకు లైసెన్స్ తప్పనిసరి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఫుడ్ వ్యాపారస్తులు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ, తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని జివిఎంసి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు సూచించారు. కెవిజివిఎం ఆధ్వర్యాన 'ఆహార భద్రత- శిక్షణ కార్యక్రమం' గురువారం పౌరగ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాణ్యమైన ఆహారాన్ని అందిస్తే వ్యాపారాలు బాగుంటాయని తెలిపారు. గుర్తింపు ఉన్న మంచి కంపెనీల ఉత్పత్తులను ఆహారం తయారీకి వాడాలని చెప్పారు. ప్లాస్టిక్ సంబంధిత, నాణ్యతలేని నూనెలను ఉపయోగించరాదన్నారు. కెవిజివిఎం సౌత్ ఇండియా ఇన్‌ఛార్జి మోహన్‌బాబు మాట్లాడుతూ నాణ్యమైన ఆహారం అందించడం, కల్తీని నివారించడం నేర్చుకోవాలనేది శిక్షణ ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా నాయకులు దండి ప్రియాంక, గవర వెంకటరమణ, కండవ గాయత్రి, ట్రైనర్ సురేష్ కుమార్, జగన్ మురారి పాల్గొన్నారు.

ఇంటింటికీ ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

పథకాలపై టిడిపి నేతల ప్రచారం

ప్రజాశక్తి-జీకే వీధి: సూపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం లో బాగంగా సంకాడ పంచాయతీ మండల గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు ఆధ్వర్యంలో టిడిపి మండల అధ్యక్షులు పోతూరు కొండలరావు పర్యటించారు. అనంతరం సంకాడ పంచాయతీ పరిధి గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, పెన్షన్ లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభ వంటి అనేక పథకాలను వివరిస్తూ వారి సమస్యలు అడుగుతూ ఇంటింటికి ప్రచారం చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మొట్టడం లక్ష్మణరావు, గ్రామకమిటీ ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, కార్యదర్శి రాజారావు, గ్రామకమిటీ ఉపాధ్యక్షులు సుభద్ర, కోశాధికారి సంజీవ్‌రావు, యూనిట్ ఇంచార్జి చంటిబాబు, బూత్ ఇంచార్జ్ బొజ్జిపాడల్, టీడీపీ నాయకులు రంగారావు,నూకరాజు, సోమరాజు, శ్రీరాములు,గబ్రియేలు, ముర్ల భూపతిరాజు తదితరులు పాల్గున్నారు.

ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: అల్లూరి జిల్లాలో ఖాళీగా ఉన్న ఆశ కార్యకర్తల పోస్టులను భర్తీ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ పోతురాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో అనేకమంది ఆశ కార్యకర్తలు అనారోగ్యంతో మృతి చెందారని, మరికొందరు రిటైర్మెంట్ అయి ఉన్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఖాళీగా ఉన్న ఆశ కార్యకర్తల పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

విద్యార్థులతో పనులు చేయిస్తారా..

విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఆగ్రహం

అసహనం వ్యక్తం చేస్తున్న విజిలెన్స్ కమిటీ సభ్యుడు

ప్రజాశక్తి -అనంతగిరి: విద్యార్థులతో పాఠశాలలో పనులు చేయించడం మెనూ సక్రమంగా అమలు చేయకపోవడంపై ఎస్సీ ఎస్టీ మోనిటరింగ్ జిల్లా విజిలెన్స్ శాఖ కమిటీ సభ్యులు వంతల. దేవదాసు మండిపడ్డారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో సంబంధిత అధికారులకు లిఖిత పూర్వకంగా నివేదిక అందజెస్తానని తెలిపారు. గురువారం మండలంలోని ఎగువశోభ పంచాయతీ కొత్తవలస బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ముందుగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, మెనూ ప్రకారం భోజనాలు పెట్టలేదని, ఒకే రకమైన కూర మాత్రమే పెడుతున్నారన్నారు. రోజువారి మెనూలో అరటిపండు, గుడ్డు పెట్టలేదని, కూరకాయలు తమ చేత కోయిస్తున్నారన్నారు. భోజనాలు తామే వడ్డించుకుంటున్నామన్నారు. స్నానపు గదులు లేక అరుబయట పొలాల్లో గెడ్డకు వెలుతున్నామన్నారు. ఈ విషయాలపై ఏటిడబ్ల్యూను ఆయన ప్రశ్నించగా ఇవి తమ దృష్టికి రాలేదని, తాను కొత్తగా వచ్చానని చెప్పడంతో హెచ్‌ఎం నిర్లక్ష్య కారణంగానే విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేవని ఆయన మండిపడ్డారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు, రన్నింగ్ వాటర్ అందుబాటులోకి తెచ్చి విద్యార్థులకు సమస్య లేకుండా చూడాలని సూచించారు విద్యార్థులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారుల దృష్టికి నివేదిక అందచేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ కాఫీ బోర్డు సభ్యుడు శెట్టి. రాజు, మండల బిజెపి నాయకులు రామచందర్ పాల్గొన్నారు.

66 వేల కుటుంబాలకు 100 రోజుల పనిదినాలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: జిల్లా వ్యాప్తంగా 69వేల కుటుంబాలకు 100రోజుల పనిదినాలు కల్పించామని డ్వామా పీడీ విద్యాసాగర్ అన్నారు. మండలంలోని సాగర పంచాయతీ పొడ్డగుడలో అడవితల్లి బాటతో నిర్మితమయిన బీటీరోడ్డును పరిశీలించారు. కురిడిలో సీసీ రోడ్డు, పాఠశాల ప్రహరీ గోడ అభివృద్ధి పనులపై సమీక్షించారు. 1.48లక్షల పని దినాలు కల్పించాల్సి ఉండగా, 1.68 లక్షల పని దినాలను కల్పించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపామన్నారు. సగటు కూలి 74.85శాతంతో ముందు వరుసలో ఉన్నామన్నారు. 30వేల ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగుకు శ్రీకారం చుట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా 10500 పంట కాలువలు నిర్మించగా, 13608 ఇంకుడు గుంతలు నిర్మించడం జరిగిందన్నారు. ఉద్యానవ పంటలతో గిరిజన శ్రామికులు ఆదాయాన్ని పొందాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఆయన తెలిపారు. అరకు క్లస్టర్ ఏపీడీ పవన్, ఏపీవో సంగంనాయుడు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పునరావాస కాలనీకి చేరిన నిర్వాసితులు

పునరావాస కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : ఎటపాక మండలం రామ్‌గోపాల్ పురంలో ఏర్పాటు చేసిన పోలవరం పునరావాస కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు. విఆర్ పురం మండలం, శ్రీరామగిరి పంచాయతీ పరిధి కొటారు, గోమ్ము గొందూరు గ్రామాల నిర్వాసితులు పునరావాస కాలనీకి తెరలివెళ్లారు. ఈ సందర్భంగా నిర్వాసితులు ఆత్మకూరు కాంతారావు, వడ్డాణపు లక్ష్మణరావు మాట్లాడుతూ తమ కాలనీలో మంచినీరు, రోడ్డు డ్రైనేజీ, వీధి దీపాలు వంటి సౌకర్యాలు లేవన్నారు. రాత్రి సమయంలో చిమ్మ చీకటిలో నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తాగునీటి బోర్లు, వీధి దీపాలు వేయాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తను కూడా నియమించకపోవడంతో జ్వరాలు వస్తే చూడటానికి ఎవరూ లేరన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పునరావాస కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఆశా వర్కర్‌ను నియమించాలని కోరారు.

పామాయల్ తోటలతో రైతులకు అధిక ఆదాయం

ప్రజాశక్తి-అడ్డతీగల : పామాయిల్ తోటలు సాగు చేయడం ద్వారా రైతులు అధిక ఆదాయం పొంది ఆర్థిక అభివృద్ధి సాధిస్తారని పతాంజలి ఫుడ్స్ పెద్దాపురం డీజీఎం ఏఎస్ ప్రకాష్ అన్నారు. అడ్డతీగల మండలం తిమ్మాపురం గ్రామంలో పతాంజలి ఫుడ్స్, పిఠాపురం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పామాయిల్ తోటల విస్తరణ మహోత్సవం గురువారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా పూర్తి సబ్సిడీపై పామాయిల్ మొక్కలు అందించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని సూచించారు. పామాయిల్ తోటలలో నీటి యాజమాన్య పద్ధతులు, డ్రిప్ ద్వారా ఎరువులు ఇవ్వడం, చీడ పీడల గురించి వివరించారు. అనంతరం నూతనంగా మొక్కలు వేస్తున్న రైతులకు తిమ్మాపురం వైస్ ప్రెసిడెంట్ అట్టా శ్రీను, డీజిఎం ప్రకాష్ చేతుల మీదుగా మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, డ్రిప్ కంపెనీ ప్రతినిధి గొల్లపల్లి సతీష్, ఫీల్డ్ ఆఫీసర్ ఎస్.రాంబాబు, కొండలరావు, సతీష్, కుమార్, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

నేడు నిస్తార్ జలప్రవేశం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ డైవింగ్ సపోర్టు నౌక నిస్తార్ శుక్రవారం జలప్రవేశం చేయనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేత్, నావికా దళ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠీ హాజరుకానున్నారు. విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఈ నౌకను నిర్మించగా 120 ఎమ్ఎస్ఎంఇ కంపెనీలు భాగస్వామ్యమయ్యాయి. అంతేకాకుండా 80 శాతం కంటే ఎక్కువ స్వదేశీ పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ నౌకను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా భారతదేశ సామర్థ్యాన్ని చాటి చెప్పే విధంగా నిర్మించారు.

టిడ్కో గృహాలన్నింటికీ మౌలిక సదుపాయాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డిసెంబర్‌కు టిడ్కో గృహాలన్నింటిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ తెలిపారు. గురువారం దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలిసి ఆయన 39వ వార్డు సీహార్స్ జంక్షన్, చిలకపేటలో ఉన్న టిడ్కో గృహ సముదాయాలను పరిశీలించారు. అక్కడి నివాసితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటర్ లీకేజీ సమస్య ఉన్నట్టు అక్కడి వారు తెలిపారు. దీంతో ఇళ్లు దెబ్బతింటున్నాయని, చుట్టుపక్కల ప్రాంతాలు శుభ్రత లోపిస్తున్నాయని ఫిర్యాదు చేశారు.

పేదవారా ? కాదా ?

బంగారు కుటుంబాల రీ సర్వేకు కసరత్తు
తొలి దశలో విశాఖ జిల్లాలో 73,949 కుటుంబాల గుర్తింపు
సాయం కోసం ఒక్క సంపన్నుడూ ముందుకు రాని వైనం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో
జిల్లాలో బంగారు కుటుంబాల రీ సర్వేకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే గుర్తించిన కుటుంబాల్లో పేదలెంతమంది ? అన్నది నిర్దిష్టంగా ధ్రువీకరించుకోవడమే దీని ఉద్దేశ్యమని అధికారులు చెబుతున్నారు. పేద, ధనిక అంతరాలు తగ్గించేందుకు పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్ (పి-4) అమలు ద్వారా ముందుకెళ్తాంటూ బంగారు కుటుంబాల తయారీకి రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టరేట్‌లకు దీనికి సంబంధించిన నమూనా పత్రాలను పంపింది. పేదవారిని గుర్తించేందుకు ఐదు ప్రశ్నలతో తయారు చేసిన సర్వే కూడా చేపట్టింది. విశాఖ జిల్లాలో 22.50 లక్షల మంది జనాభాలో మొదటి దశలో 73,949 మంది పేదలను బంగారు కుటుంబాలకు అర్హులుగా జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారుల ఆధ్వర్యాన గుర్తించారు. ఆయా అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఈ వివరాలను సిపిఒ కార్యాలయ అధికారులు ఇప్పటికే పొందుపరిచారు. మరో దఫా 'రీ వేలిడేషన్' కోసం గ్రామ పంచాయతీ, సచివాలయాల ద్వారా సర్వేను ప్రభుత్వం గురువారం నుంచి చేపట్టింది. ఇప్పటి వరకూ గుర్తించిన వారందరినీ మరో దఫా గ్రామసభల్లో పరీక్షించనున్నారు. 'పేదవారా ? కాదా ?' అన్నది ధ్రువీకరించుకునేందుకు ఐదు ప్రశ్నలతో కూడిన పత్రాన్ని వారికి ఇచ్చి వివరాలను నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కొద్ది వారాల్లో ఈ సర్వే కూడా పూర్తి కానుంది. స్థానిక పరిశ్రమలకు ఈ కుటుంబాలను దత్తత ఇవ్వాలన్నది ప్రభుత్వ విధానంగా ఉంది. ఏ నియోజకవర్గంలో పేదలను ఆ అసెంబ్లీ సెగ్మెంట్‌లోగల పరిశ్రమల అధిపతులకు అప్పగించాలన్నది దీని ఉద్దేశం. ఇలా పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా మార్చేందుకుగానూ సంపన్నులైన కొంతమంది సాయం తోడ్పడుతుందని ప్రభుత్వ భావన. 'మార్గదర్శుల సాయం'తో 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చేస్తామని చంద్రబాబు ప్రభుత్వం ప్రచారం చేస్తోంది.

విశాఖలో ఆచరణలో జరిగిందేంటి ?

పేదలకు ఆర్థిక మద్దతు ఇవ్వడం, నాణ్యమైన విద్య, వైద్యం అందించడం కోసమంటూ ఇప్పటివరకూ విశాఖ జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 73,949 కుటుంబాలకు సాయం అందించడానికి పారిశ్రామికవేత్తలుగానీ, సంపన్నులైన రాజకీయ కుటుంబాలుగానీ ఎవ్వరూ ముందుకు రాలేదని సంబంధిత అధికారులు 'ప్రజాశక్తి'కి గురువారం తెలిపారు. ఇంతవరకూ పేదలను గుర్తించామని, ఈ నెల 17 నుంచీ రీ వేలిడేషన్ హౌస్ హోల్డ్ సర్వే ద్వారా పేదలా ? కాదా ? అన్నది నిర్ధారిస్తామని చెబుతున్నారు.

పేద కుటుంబాల విషయమై పంచాయతీ తీర్మానం చేశాక, సచివాలయం ఆ డేటాను ఎక్కడికక్కడ అప్‌లోడ్ చేశాక మరలా సంపన్నుల సాయం కోసం ప్రయత్నాలు చేస్తామని చీఫ్ ప్లానింగ్ అధికారి వెల్లడించారు. బంగారు కుటుంబాలకు పథకాలన్నీ వర్తించేలాగ ప్రభుత్వం విధానం తీసుకుందని తెలిపారు.

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ ఫిర్యాదులపై

తక్షణం స్పందించండి

జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యులు రామచందర్

మాట్లాడుతున్న రామచందర్

ప్రజాశక్తి - అనకాపల్లి : నిమ్న వర్గాల అభ్యున్నతి లక్ష్యంగా అధికారులు అడుగులు వేయాలని, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ అన్నారు. జాతీయ ఎస్‌సి కమిషన్ షెడ్యూల్డు కులాల సాంఘిక, ఆర్థిక అభివృద్ధిలో విశేష కృషి చేస్తోందని తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్‌పి తుహిన్ సిన్హాలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎస్‌సి తరగతిలో అక్షరాస్యత, వివిధ పథకాల అమలు, ఆరోగ్యం, పోషణ, భూ పంపిణీ, నవోదయం తదితర అంశాలను కలెక్టర్ విజయ కృష్ణన్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఆయా శాఖల పరిధిలో అమలు చేస్తున్న కార్యక్రమాల ప్రగతిని తెలియజేశారు. అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసులు, వాటిలో పురోగతి, గ్రామాల్లో సైతం సీసీ కెమెరాల ద్వారా నిఘా వంటి విషయాలను జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా వివరించారు. ఈ సందర్భంగా రామచందర్ మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా వారికి అందేవిధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ చట్టం ద్వారా అర్హులందరికీ జాబ్ కార్డులు ఇచ్చి పనిదినాలు కల్పించాలని అన్నారు. పరిశ్రమలు స్థాపించుకునేందుకు శాఖాపరంగా సహకారం అందించాలన్నారు. సమావేశంలో జాతీయ ఎస్‌సి కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్ బాబు, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ సుబ్బలక్ష్మి, అనకాపల్లి ఆర్‌డిఒ షేక్ అయిషా, షెడ్యూల్డు కులాల సంక్షేమ ఉప సంచాలకులు బి.రామానందం, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశంలో రక్త కొరత తీవ్రంగా ఉందని, ఈ నేపథ్యంలో యువత పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ పిలుపునిచ్చారు. గురువారం ఉదయం సిరిపురంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ థియేటర్‌లో నెరెడ్కో, విఎంఆర్‌డిఎ సంయుక్తంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నరెడ్కో రాష్ట్ర అధ్యక్షులు గద్దె చక్రధర్‌తో కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.

రోగుల సమస్యలను తెలుసుకుంటున్న లచ్చన్నదొర

ఏరియా ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం
ఏరియా ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలని ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ కోసు లచ్చన్న దొర విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన రంపచోడవరం ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్ పేషెంట్లకు ఫ్యాన్లు సరిగ్గా పనిచేయని పరిస్థితి ఉందని, ఆసుపత్రిలోని సమస్యలను సూపరింటెండెంట్‌కు చెబితే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పురుషుల వార్డులో ఫ్యాన్ తిరగక రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలను వివరించడానికి సూపరింటెండెంట్ వద్దకు వెళ్తే తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలా చేస్తే ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. రోగులకు సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయా లేదా అని నేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న దేవీపట్నం మండలం తాటివాడ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడిని పరామర్శించారు.

వైద్యుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి

రంపచోడవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యులు నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యాన గురువారం ఐటిడిఎ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు మాట్లాడుతూ హాస్పటల్‌లో వై.రామవరం మండలానికి చెందిన ఆదివాసీ మహిళ కాకూరి పార్వతి ప్రసవం జరిగిన తర్వాత మృతి చెందితే ఆ విషయాన్ని బయటకి తెలియకుండా గోప్యంగా ఉంచడానికి గల కారణం వైద్యులు తప్పిదం కాదా అని ప్రశ్నించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారెడ్డి పత్రికా ప్రకటన ద్వారా తమ డాక్టర్లను కాపాడుకొనే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఒక నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నామన్న పశ్చాతాపం వారిలో లేదని ఆయన విమర్శించారు. కాకూరి పార్వతి మృతికి కారుకులైన వైద్యులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఐటీడీఏను ముట్టడించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం రంపచోడవరం డివిజన్ అధ్యక్షులు మోడిద నూకరాజు, కోఆర్డినేటర్ పీఠ ప్రసాద్, కడబాల శ్రీనుబాబు, చిలకల గుణేశ్వరరావు, వెన్నెల చిన్నారావు, మామిడి ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎఎస్‌పి మండల ప్రధాన కార్యదర్శిగా చిన్నారెడ్డి

ప్రజాశక్తి-అడ్డతీగల : ఆదివాసీ సంక్షేమ పరిషత్ అడ్డతీగల మండల ప్రధాన కార్యదర్శిగా మామిడి చిన్నారెడ్డిని జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు నియమించారు. తనపై నమ్మకంతో పదవిలో నియమించినందుకు జిల్లా అధ్యక్షులు బాబూరావు, డివిజన్ అధ్యక్షులు మోడిద నూకరాజుకు చిన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తానని, ఆదివాసీ హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం డివిజన్ కోఆర్డినేటర్ పీఠా ప్రసాద్, ఉల్లెం రాంబాబు, కోసూరి లచ్చిరెడ్డి, పల్లాల రాజు తదితరులు పాల్గొన్నారు

ఆత్మ రక్షణపై బాలికలకు అవగాహన

ప్రజాశక్తి-రంపచోడవరం : విద్యార్థినులు అత్యవసర పరిస్థితుల్లో ఆత్మ రక్షణకు తీసుకోవలసిన చర్యలపై రంపచోడవరం అడిషనల్ ఎస్పై భూషణం ఆధ్వర్యాన స్థానిక కెజిబివిలో గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆపత్కర సమయాల్లో ఆత్మ రక్షణ ఏ విధంగా చేసుకోవాలో ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.